# పూలతేరు

చలపతి రావు గారి పెంకుటింటి ముందు రెండెడ్ల గూడుబండి ఆగివుంది. బండిలో ఒత్తుగా పరిచిన వరిగడ్డిమీద ఈతాకుల చాప పరిచివుంది.

చలపతిరావు గారి ఏకైక పుత్రిక స్వర్ణలత తొలిసారిగా కాపురానికి వెళ్ళటానికి ప్రయాణ సన్నాహాలు పూర్తి అయినాయి. హైదరాబాద్ వెళ్ళే బస్ దగ్గరకెళ్ళటానికి ఈ బండి తయారుగా వుంది.

చలపతిరావు గారి ఇంటిపాలేరు భీముడు మహాలక్ష్మమ్మగారు అందిచ్చే సామానులని బండిలో ఎంతో పొందిగ్గా సర్దుతున్నాడు.

చలపతిరావుగారి కొత్తల్లుడు వరండలో నిల్చుని బండిలో సగానికి పైగా సర్దిన సామానుని చూస్తూ 'బాప్‌రే' అనుకోసాగాడు.

"అమ్మా స్వర్ణా టైము అయిందమ్మా రావాలి" చలపతిరావు గారు కేకపెట్టారు.

స్వర్ణ తల్లిదండ్రులకీ, తమ్ముడికీ, స్నేహితురాళ్ళకీ చెప్పి కళ్ళు తుడుచుకుంటూనే బండి దగ్గరికొచ్చింది. భీముడు కుర్చీపీట వేసి గట్టిగా పట్టుకున్నాడు.

తల్లి పెట్టిన కొత్త చీరెలో పసుపు రాసిన పచ్చని పాదాలతో, తలలో చామంతిపూలతో అచ్చమైన తెలుగింటి ఆడబడుచు అత్తారింటికి వెళ్ళటానికి కుడిపాదం ముందుపెట్టి బండిలోకి ఎక్కింది స్వర్ణ.

అత్తగారికీ మామగారికీ చెప్పి బండి దగ్గరకి రాబోతూన్న మురళీ మోహన్‌తో అత్తగారంది.

"అల్లుడుగారూ నాదో ఘాట. చూడండీ అదిగో భీముడు తెస్తున్నాడే ఆ పట్టెమంచం స్వర్ణది. అది దానిమీదే పడుకుని పెరిగి పెద్దది అయింది. దాన్ని అడ్డంపెట్టుకొని బొమ్మలాటలు ఆడేది. ఆ మంచం అంటే దానికి ప్రాణం. ఆ మంచం కూడా మీరు పట్టుకువెళ్ళాలి. అదిగో భీముడు బండి గూడుమీద వేసి తాళ్ళతో కట్టేస్తాడు'

మురళీమోహన్ తలతిప్పి చూశాడు. భీముడి చేతిలో పాలిష్‌చేసి తెల్లగా ఇస్త్రీ చేసిన నవారుతో ఓడంత మంచం చూస్తేనే గుండె పట్టుకుని - "అత్తగారూ క్షమించండి' 'అని 'ఈ మంచం అంత విశాలమైనది కాదే నా అద్దెగది' అని మనసులో అనుకుని "భీముడూ" అన్నాడు కంగారుగా.

భీముడు అల్లుడివైపు చూశాడు.

"ఆ మంచం మేం తీసుకువెళ్ళాలంటే నువ్వూ నీ ఈ బండి హైదారాబాద్ వరకూ రావాలి" అన్నాడు. నవ్వు తెచ్చుకుంటూ.

"ఓ అట్టాగే బాబూ. హైదరాబాద్‌కి వస్తా. ఏరా రామన్నా లచ్చమన్నా పోదామా' 'అంటూ ఎడ్లవైపు చూశాడు. తన భాష తెల్సినట్లుగా రెండు ఎట్లూ తలలు ఊపుతూ వుంటే వాటి మెడలో వున్న పట్టెడలోని చిరుగంటలు చిన్నగా శబ్దంచేయసాగాయి.

చలపతిరావు గారు చేతివాచీ చూసుకుంటూ-

"అయ్యో బండి తొందరగా బయలురేరాలి. అవతల వర్జ్యం వచ్చేస్తోంది. భీముడూ సామాను ఎక్కువయిందని అల్లుడుగారు మంచం వద్దు అంటున్నారులా వుంది. దాన్ని తీసుకువెళ్ళి వసారాలో పెట్టేసి త్వరగా రా" అన్నారు.

యజమాని మాట వింటూనే ఇష్టం లేకున్నా మంచం వసారాలో పెట్టి బండి దగ్గరకి వచ్చి ఎడ్ల తాళ్ళని పట్టుకుని నడవసాగాడు.

"జాగ్రత్త అల్లుడూ వెళ్ళగానే ఉత్తరం రాయి" అంటూనే ఊరి చివరివరకూ బండితోపాటు నడిచి వచ్చి ఆగిపోయారు చలపతిరావుగారు. అప్పుడు బండి ఎక్కాడు మురళీ మోహన్.

అయ్యగారు కనుమరుగైన తర్వాత భీముడు బండెక్కాడు. బండి పరుగు ప్రారంభించింది.

ఎర్రబడిన కళ్ళలోకి ప్రేమగా చూస్తూ- "స్వర్ణా!" అన్నాడు మురళీమోహన్.

"ఊఁ" అంది మెల్లగా.

"నిజంగా మీవాళ్ళనందరినీ వదిలి రావటానికి ఇంత బాధగా వుంటే రోజుకో ఉత్తరం రాసి నన్నెందుకు పరుగులెత్తించావ్?" గోరింటాకుతో ఎర్రబడిన స్వర్ణ చేతిని తన చేతిలోకి తీసుకుని చూస్తూ అడిగాడు.

"మిమ్మల్ని వదిలి వుండలేక" అంది తగ్గు స్వరంతో.

"ఔనా! నేను నీ జీవితంలోకి వచ్చి ఒకే ఒక్క నెలేకదూ అయింది"

"నాకలా అన్పించటంలేదు"

"నిజం" స్వర్ణ గడ్డం పట్టుకుని కాస్త పైకి ఎత్తి అడగుతూంటే స్వర్ణ సిగ్గుతో మొగ్గే అయింది.

"నాకూ అలానే అన్పిస్తోంది సుమా" అంటూ నవ్వాడు మురళీమోహన్.

ఇద్దరూ ఇలా కబుర్లు చెప్పుకుంటూనే వున్నారు. ప్రయాణం సాగుతూనే వుంది.

"అల్లుడుగారూ బస్ దగ్గరకి వచ్చేశాం" అంటూ బండి ఆపి దిగాడు భీముడు.

"అమ్మాయిగారూ యీపాలి మీరొచ్చినప్పుడు మీ మంచం పట్టుకెల్లిపోండి. ఆ.. అప్పటివరకూ దాన్ని జాగ్రత్తగా సూసుకుంటా. అల్లుడుగారూ బస్సెల్లి పోతావుంది. వుంటా. వెళ్ళగానే ఉత్తరం రాయండీ" భీముడు ఇలా అప్పగింతలు చేస్తూండగానే బస్ కనుమరుగైపోయింది.

★ ★ ★

స్వర్ణలత హైదరాబాదులో బస్ దిగింది. అత్తగారిచ్చిన సామాను తనువుండే ఇంటికి చేర్చటానికి మురళీమోహన్ అష్టకష్టాలూ పడ్డాడు. ఆటోవాళ్ళు వందరూపాయిలు వసూలు చేశారు.

"వంటగది ఏదండీ" అంది స్వర్ణలత, తల్లి ఇచ్చిన ఊరగాయ జాడీలని భద్రంగా పట్టుకుని.

"ఇదిగో స్వర్ణా! వంటిల్లేదీ, పడక గది ఏదీ, హాలు ఏదీ అని మళ్ళీ మళ్ళీ అడక్కు. అవన్నీ కలిపి ఈ ఒక్క గదే ఇందులోనే నువ్వు తెచ్చుకున్న సామానంత సర్దాలి. తెల్సిందా!' అన్నాడు విసుగ్గా.

స్వర్ణ తెల్లముఖం వేసుకుని ఆ గది నలువైపులా పట్టిపట్టి చూడసాగింది.

"ఈ గది మీ ఊరిలోని 'స్టోరురూము' అంత లేదు అనికదూ చూస్తున్నావు. చూడు స్వర్ణా! ఈ మహాపట్నంలో ఇంత గది అయినా దొరకనివాళ్ళు చాలామంది

వున్నారు. ఇంక ఈ విషయం వదిలి అదిగో అక్కడ నీళ్ళు వున్నాయి. ముందు ముఖం కడుక్కో నేవెళ్ళి కాఫీ తెస్తాను" అంటూ ఫ్లాస్కు తీసుకుని బయటకు వెళ్ళిపోయాడు.

అశోకవనంలో సీతాదేవిలా దిక్కు తోచనట్లుగా ఆ సామానుల మధ్య దిగాలుగా కూర్చుండిపోయింది కొత్తగా కాపురానికొచ్చిన స్వర్ణలత.

★ ★ ★

మురళీమోహన్ తెచ్చిన కాఫీ తాగి సామాను సర్దుకోసాగింది స్వర్ణలత. ఇంతలో పక్కగదిలోనే అద్దెకి వున్న శివప్రసాదూ, చాముండేశ్వరీ వచ్చారు.

మురళీమోహన్ వాళ్ళకి భార్యని పరిచయం చేశాడు,

కుశల ప్రశ్నలు అయిన తర్వాత చాముండేశ్వరి "స్వర్ణలతగారూ ఈ పూటకి మీకు నేను వంట చేస్తాను. సామాను సర్దుకుని స్నానం చేయండి. అన్నట్లు తొందరగా నీళ్ళు పట్టుకోండి. లేకుంటే నల్లా బందయిపోతుంది" అంది.

స్వర్ణలత భర్త ముఖంలోకి చూసింది. 'ఏం జవాబివ్వాలి?' అన్నట్లుగా.

"అలాగే వస్తాంలెండి" మురళీమోహన్ తనే జవాబిచ్చేశాడు.

ఆ ఇద్దరూ వెళ్ళిపోయారు.

"స్వర్ణా! ముందు సామానుల్లోనించి బిందెలు తియ్యి. నీల్ళు పోతాయి" అన్నాడు ఓసారి వాచీ చూసుకుంటూ.

"నీళ్ళు ఎక్కడికిపోతాయి" అంటూ దీర్ఘం తీసింది గోనెసంచీలోని స్టీలు బిందెలు బైటకి తీస్తూ.

"ఎక్కడికీ పోకుండా వుండేందుకు మీ పెరడులోని నూతులు కావు ఇక్కడ. పంపులు. ఏడింటికి వచ్చి ఎనిమిదింటికి 'బంద్' అవుతాయి" అంటూ బిందెలు పట్టుకుని పైపు దగ్గరకి వెళ్ళాడు.

తన పుట్టింటికి వచ్చినప్పుడు హుందాగా వాలు కుర్చీలో కూర్చుని తండ్రితో మాట్లాడే భర్తనే ఎరిగున్న స్వర్ణకి భర్త ఇలా నీళ్ళబిందెలు పట్టుకెళ్ళటం, కొన్ని పనులు చేయటం ఆశ్చర్యంగా అన్పించ సాగింది. 'హాయిగా భీముడిని పిలిపించుకుంటే' అనుకోసాగింది.

నీళ్ళ బిందెలు మోసుకొస్తున్న భర్తతో అంది- "ఏమండీ భీముడినీ పిలిపించుకుందామా" అని.

నా నెలజీతం వాడి భోజనానికి సరి" అంటూ నవ్వాడు మురళీమోహన్.

"మీ ఉద్యోగం బ్యాంకులోకదా" అంది స్వర్ణ భర్త ముఖంలోకి చూస్తూ.

"అయితే నెలజీతం మాత్రమేగా నాకిచ్చేది" అన్నాడు విసుగ్గా.

స్వర్ణలత ఇంక పెదవి కదపలేదు.

భార్యాభర్తలు ఇద్దరూ భోజనాలు చేసి సామానంతా నీట్‌గా సర్దుకునేసరికి రాత్రి ఎనిమిది గంటలు అయిపోయింది.

"స్వర్ణా! ఈ పూటకీ చాముండేశ్వరిగారింట్లోనే మన భోజనం. రేపటినుంచీ నువ్వు వంట ప్రారంభించాలి సుమా" అన్నాడు. మురళీమోహన్ కళ్ళు మూసుకునే రేడియోలో వస్తున్న పాటలు వింటూ.

"ఈ ఇల్లు అస్సలునాకు నచ్చలేదు. నాకసలు ఊపిరి సలపనట్లే వుంది" అంది కాస్త కోపంగా.

"అమ్మో ఆ మాట అనకు" చప్పున కళ్ళు తెరచి చూస్తూ అన్నాడు.

"ఇంత చిన్న ఇల్లు అని మీరు నాకు చెప్పలేదు" అంది మరీ కోపంగా.

"నువ్వు ఎంత పెద్ద ఇల్లు? అని అడగలేదు"

"అదీ నాతప్పేనా? అయితే నన్ను మా వాళ్ళింటికి పంపేయండి. పెద్ద ఇల్లు తీసుకున్న తర్వాత వస్తాను" అంది స్వర్ణలత.

"అలాగా! అయితే కనీసం ఒక సంవత్సరమన్నా మీ ఊళ్ళో వుండాలి. ఉంటావా?"

"బాప్‌రే! అయితే వెళ్ళను. కానీ స్నానంచేసి వస్తాను" అంటూ నీళ్ళ బకెట్, తువ్వాలూ, సోపూ పట్టుకుని బయలుదేరింది స్వర్ణ.

ఆ... ఆ.... ఆగు. ఆ నీళ్ళు కాస్తా స్నానంచేస్తే రేపు ఉదయం నీళ్ళు వచ్చే వరకూ ఎలా!

కనుక ఒకచెంబుడు నీళ్ళు తీసుకువెళ్ళి ముఖం కడుక్కుని బట్టలు మార్చుకో" అన్నాడు కంగారుగా స్వర్ణలత చేతిలోని నీళ్ళబకెట్ అందుకుని పక్కన పెట్టేస్తూ.

'అమ్మా స్వర్ణా! హైదరాబాద్ వెళ్లింతర్వాత కూడా సాయంకాలం స్నానం చేసి తెల్లని ఇస్త్రీ చీరె కట్టుకుని తలలో పువ్వులు పెట్టుకునీ...' అంటూ తల్లి చెప్పిన మాటలు గుర్తుకివచ్చాయి స్వర్ణకి.

నవ్వూవచ్చింది. కోపమూ వచ్చింది. అయినా తప్పదు కనుక చెంబుడు నీళ్ళతో ముఖం కడుక్కుని గదిలోకి వచ్చింది స్వర్ణలత.

★ ★ ★

చాముండేశ్వరి ఇంట్లో భోజనాలు అయినాయి. "ఇప్పుడే వస్తాం" అంటూ మురళీమోహన్ స్నేహితుడిని వెంట తీసుకుని బైటకి వెడుతూ - "ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ వుండండి" అని వెళ్ళిపోయాడు.

చాముండేశ్వరీ స్వర్ణలతా సినిమాలూ సీరియల్ నవలలూ గురించి కబుర్లు చెప్పుకున్నారు.

ఓ గంట గడచిన తర్వాత మురళీమోహన్ "స్వర్ణా" అంటూ పిలిచాడు.

"వస్తానండీ" అంటూ చాముండేశ్వరికీ చెప్పి తన గదిలోకి వచ్చింది స్వర్ణలత.

గదిలో ఓ చిన్న నవారుమంచంమీద తెల్లని దుప్పటి పరచివుంది. గోడకి ఇటూ అటూ మేకులు కొట్టి కట్టిన పురికొసకి మల్లెపూలదండలు వేలాడుతున్నాయి. మంచంమీద కూడా విచ్చిన మల్లెలు, గులాబీరేకులూ పరచివున్నాయి.

వాటిని చూడగానే ఒళ్లు మండుకొచ్చింది స్వర్ణకి.

"ఏమిటిదంతా?" విసుగ్గా అడిగింది.

"మన ఇంట్లో ఇది మనకి మొదటి రాత్రి కదూ"అంటూ గది తలుపులు మూశాడు. ఆ తలుపు బర బర శబ్దం స్వర్ణ చెవులకి కఠోరంగా విన్పించింది.

తన కలల్లో ఊహించుకున్న ఇల్లుఇలా లేదు. తన ఇల్లు అందమైన పెద్ద బంగాళా. ముందు రకరకాల పూలచెట్లూ, లోపల ఆధునికమైన అన్ని హంగులతో వుంటుంది. అలాంటి ఇంట్లో తనూ తన భర్తా స్వేచ్ఛగా సంతోషగా జీవితం ప్రారంభిస్తారన్న ఊహ ఈ ఒక్క గది చూడగానే కలలా కరిగిపోయింది. అయినా ఓర్పు వహించింది ఇంతవరకూ. కానీ చిన్నమంచం గోడలమీద పాకే బొద్దింకలూ లైటు వున్నా పరుగులు పెట్టే ఎలుకలూ అప్పుడే జోరుగా సంగీతం పాడే ఈగలంతా దోమలూ గాలి కాస్త కూడా చొరబడని ఈ గదీ...

స్వర్ణలతలో అసహనాన్ని పెంచసాగాయి.

ఇదేం గమనించని మురళీమోహన్ స్వర్ణని అమాంతం రెండుచేతులతోనూ ఎత్తి మంచంమీద పడుకో బెట్టాడు. మంచం కిర్రు కిర్రున శబ్దం చేస్తూ ఆర్తగజం అడుక్కుపోయింది.

"బాబోయ్" స్వర్ణ పెద్దగా కేక పెట్టింది.

"అరె. అలా అరవకు. పక్కగదిలో వాళ్ళకి వినిపిస్తుంది." మురళీమోహన్ గాభరాగా అన్నాడు.

"ఇదో గోల కాబోలు ఇక్కడ" మూతి బిగించింది స్వర్ణ. 'ఏమిటీ ఈ మంచం' అన్నట్లుగా చూస్తూ.

మురళీమోమహన్ "భయపడకు ఈ మంచం మా అమ్మమ్మ నా కోసం చేయించింది. అదీకాక దీని వెనుక ఓ గొప్ప చరిత్ర వుంది" అన్నాడు స్వర్ణలో సస్పెన్స్ క్రియేట్ చేస్తూ.

"ఏమిటది?" మూతి ముడుచుకునే అడిగింది.

"మా ఇంట్లోని ప్రతి కొత్త జంట మొదటిరోజు దీన్నే వాడుకున్నారు వాళ్ళంతా సుఖశాంతులతో అభివృద్ధిచెందుతూనే వున్నారు ఇంకా...."

"ఇంకేం చెప్పక్కరలేదు. మా ఊళ్లో నా మంచం పట్టుకెళ్ళమన్నారని మీరు ఈకథలు చెప్తున్నారు కదూ" ఆ మంచం గుర్తుకి వచ్చి రాగానే స్వర్ణ గొంతు గద్గదమైంది.

"కాదు కానేకాదు స్వర్ణా ఒట్టు " తలమీద చెయ్యి పెట్టుకుని అన్నాడు మురళీమోహన్.

అయినా నమ్మకం కల్గలేదు అని స్వర్ణ కళ్ళు చెప్తునే వున్నాయి.

"స్వర్ణా ఈ మంచానికి చరిత్రే కాదు ఒక పేరు కూడా వుంది తెలుసా" హుషారుగా అన్నాడు.

'ఏమిటీ?' అని అడగలేదు స్వర్ణ.

'పేరు చెప్పమని అడుగు స్వర్ణా. ప్లీజ్'

"చెప్పండి"

"తేరు"

"అంటే?" అర్థంకానట్టుగా చూస్తూ అడిగింది.

"తేరు' అంటే 'రథం'అన్నమాట. పూవులు కూడా కట్టాం కనుక 'పూలతేరు' అందాం.

అంత కోపంలోనూ ఫక్కున నవ్వింది.

మురళీమోహన్ "అమ్మాయిగారి కోపం పోగొట్ట గలిగాను అమ్మయ్య" అంటూ లైటు తీసేసి స్వర్ణ పక్కన చేరాడు. మంచం మరోమారు కిర్రు కిర్రు మంది. మురళీమోహన్ ఇదేం పట్టించుకోకుండా కబుర్లు చెప్పసాగాడు.

“స్వర్ణా! పెళ్ళికాకముందు ప్రతి ఆడపిల్లా ఎన్నెన్నో ఊహాసౌధాలు కడుతుంది. అలాగే నువ్వూ కట్టివుంటావు. వాటిలో ఒక్క శాతమన్నా యదార్థం అయితే ఆ అమ్మాయి జీవితంతో రాజీపడిపోతుందని నాకు తెల్సు. చూడూ నాకు బ్యాంక్ ఉద్యోగమే అయినా జీతం బాగానే వస్తున్నా నా తమ్ముడి చదువు కోసం చెల్లి పెళ్లి కోసం నాన్నగారికి సాయపడాలని కొంత డబ్బుని ఆదాచేస్తున్నాను.

ఒక్కరెండు సంవత్సరాలు నువ్వు ఓపికపడితే ఈ ఇక్కగదినీ ఖాళీచేసి మూడుగదుల ఇల్లు తీసుకోగలను. ఆ తర్వాత ఓ ఇల్లూ కట్టగలను. ఆ కొత్త ఇంటినీ నీ ఇష్టమొచ్చినట్లుగా ప్లాన్ చేయించగలను. ఆ ఇంట్లో మనకొక మాస్టర్ బెడ్‌రూమ్‌ని కట్టిస్తాను. నా ఈ మాటలన్నీ నిజం చేస్తాను స్వర్ణా!”

‘ఆ మాస్టర్ బెడ్‌రూమ్‌లోకి ఈ ‘పూలతేరు’ కూడా పట్టుకుపోదామా” భర్త మాటలకి మనసు తేలికపడిన స్వర్ణ మనస్ఫూర్తిగా నవ్వుతూ అంది.

“ఓ యస్! తప్పకుండా తీసుకువెళ్లాల్సిందే” అంటూన్న భర్త కౌగిలిలో గువ్వలా ఒదిగిపోయింది.

హైదారాబాద్ దోమలు కుడుతూనే వున్నాయి.

మంచం కిందనించి ఎలుకలు పరుగులు తీస్తూనే వున్నాయి. పక్కవాటోని భార్యాభర్తల నవ్వులు విన్పిస్తూనే వున్నాయి. అయినా స్వర్ణలత తన ఊహాసౌధాలలోనించి కిందకి దిగి భవిష్యత్ జీవితంలోకి ఆశగా చూసుకోసాగింది.

‘తన ఊహల్లో అన్నీ నిజం కాకున్నా తనకి నచ్చిన భర్త దొరికాడు. ఇది చాలు. జీవితంలో రాజీ పడటానికి’ అనుకుంటూ కళ్ళు మూసుకుంది.

*(1.7.94 స్వాతి సపరివార పత్రిక)*